

పసిడి పతకం ఆర్టిసి కార్మికుడి సొంతం



పసిడి పతకాన్ని అందుకుంటున్న విజేత

కాకినాడ: జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఆర్టిసి కాకినాడ డిపో కార్మికుడు ఎం.శ్రీనివాస రావు పసిడి పతకాన్ని సొంతం చేసుకున్నారు. ఈనెల 21వ తేదీ నుంచి 3 రోజుల పాటు పంజాబ్ రాష్ట్రంలో రైతు బారా యూనివర్సిటీ నిర్వహించిన ఆలిండియా నేషనల్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో శ్రీనివాసరావు 450 కేజీల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నారు. రాష్ట్ర స్థాయి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మొత్తం 77 పతకాలు సాధించిన శ్రీనివాసరావును పలువురు అభినందించారు. జనవరిలో బెంగుళూరులో జరగబోయే ప్రపంచ పవర్ లిఫ్టింగ్ పోటీలకు శ్రీనివాసరావు ఎంపిక ఎంపికయ్యారు.

కదం తొక్కిన కార్మిక, రైతు సంఘాలు

- గిట్టుబాటు ధర చట్టం చేయాలి
- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి
- కలెక్టరేట్ వద్ద మహా ధర్నా



కలెక్టరేట్ వద్ద కేంద్ర కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి

ప్రజాశక్తి - కాకినాడ

కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మికులు, రైతులు కదం తొక్కారు. 10 కేంద్ర కార్మిక సంఘాలు, 500 రైతు సంఘాలు సంయుక్తంగా ఇచ్చిన దేశవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం కలెక్టరేట్ వద్ద కార్మిక, రైతు సంఘాలు ధర్నా నిర్వహించాయి. జాతీయ, స్థానిక డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిఆర్ఒ వెంకటరావుకి అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు జి.బేబీరాణి, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎఫ్టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుమలశెట్టి నాగేశ్వరావు, అప్పారెడ్డి, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు తాళ్లూరి రాజు, రైతు కూలీ సంఘం నాయకులు రాజబాబు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మోర్తా రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టేకుముడి ఈశ్వరరావు, కార్యదర్శి పప్పు ఆదినారాయణ, ఐఎఫ్టియు రాష్ట్ర కార్యదర్శి ఏసు మాట్లాడారు. రైతులు పంట సాగుకు పెట్టే పెట్టుబడిపై 50 శాతం అదనంగా నిర్ణయించి చట్టం చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికుడికైనా కనీస వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని, 60 ఏళ్ల పనిచేసి రిటైర్ అయిన వారికి రూ.10 వేలు కనీస పెన్షన్ చెల్లించాలని, ఆటో, హమాలీ, ట్రాన్స్పోర్ట్, భవన నిర్మాణ కార్మికులకు సామాజిక భద్రత కల్పించే చట్టాలను అమలు చేయాలని, అంగన్వాడీ, ఆశ, మిడ్డే మీల్స్ నేషనల్ హెల్త్ మిషన్, సమగ్ర శిక్ష ఉద్యోగులను, కార్మికులను రెగ్యులర్ చేయాలని, గ్రాడ్యుటీ, పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే తదితర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను తక్షణం నిలుపుదల చేయాలని, ప్రజలపై విద్యుత్ భారాలు పెంచే 2023 విద్యుత్ చట్టాన్ని రద్దు చేయాలని, అత్యవసర మందులపై జిఎస్టి ఎత్తివేయాలని, ధరలు తగ్గించేందుకు పెట్రోల్, డీజిల్లను జిఎస్టి పరిధిలోకి తీసుకురావాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. అదానీతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు అన్నింటిని రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణం నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏలేరు వరదల సందర్భంగా 122 చోట్ల గండ్లు ఏర్పడ్డాయని, తక్షణం వాటిని పూడ్చాలని, ఈ వరదలలో మునిగిన పంటలకు ఇన్సూరెన్స్ను తక్షణం చెల్లించాలని, ఉపాధి పథకాన్ని 200 రోజులకు పెంచి రోజు వేతనం రూ.600 చెల్లించాలని, కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు, పంట రుణాలు, నష్టపరిహారాలు చెల్లించాలని, పరిశ్రమలలో ప్రమాదాల నివారణకు రెగ్యులర్గా సేఫ్టీ ఆడిట్లు నిర్వహించాలని, మూసివేసిన పరిశ్రమలు తాండవ, డెక్కన్ చక్కెర పరిశ్రమలను, చిన్నంపేట ఇంటర్ స్నాక్ క్యాష్యు పరిశ్రమలను తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని, ఎన్నికల హామీ మేరకు వాలంటీర్లు అందరినీ కొనసాగించి, రూ.10 వేల వేతనం చెల్లించాలని, 33 రోజుల నుంచి సమ్మె చేస్తున్న కాకినాడ మున్సిపల్ క్లాప్ డ్రైవర్లకు మూడు నెలల వేతన బకాయిలు, తొమ్మిది నెలల పిఎఫ్ బకాయిలు చెల్లించి సమ్మెను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్కుమార్, జిల్లా కోశాధికారి మలకా రమణ, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దడాల పద్మ, ఎరుబండి చంద్రావతి, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ మేడిశెట్టి వెంకటరమణ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చంద్రమళ్ల పద్మ, కోశాధికారి నొక్కు లలిత, మధ్యాహ్న భోజన పథ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బలక్ష్మి, నర్ల ఈశ్వరి, సిఐటియు కాకినాడ రూరల్ కమిటీ కన్వీనర్ టి.రాజా, నైట్ వాచ్ మెన్ కార్మికుల సంఘం నాయకులు వీర్రాజు, నాగేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బొబ్బిలి శ్రీనివాసరావు, జట్టు లేబర్ యూనియన్ రామకృష్ణ, సివిల్ హమాలిస్ వీరబాబు, సెక్యూరిటీ గార్డ్ వర్కర్స్ యూనియన్ జి.రామ, ఎఐటియుసి నాయకులు శాఖ రామకృష్ణ, పెద్దిరెడ్డి సత్యనారాయణ, ఎఐఎఫ్టియు జిల్లా కన్వీనర్ అంజిబాబు, ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి ఆదినారాయణ, ఎఐసిసిటియు జిల్లా నాయకులు నరసరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్, మెడికల్ రిప్స్ నాయకులు శ్రీపాదం సత్తిబాబు, బొద్దు సత్యన్నారాయణ మూర్తి, నోవాహు, పంతాడి నాగేశ్వరరావు, ఎల్లారావు పాల్గొన్నారు.



కార్మికులు, రైతులకు అభివాదం చేస్తున్న కేంద్ర కార్మిక, రైతు సంఘాల నేతలు



ఎన్నికల ప్రచారంలో మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని కోరుతున్న ఎంఎల్సి అభ్యర్థి గోపిమూర్తి

ఎంఎల్సి అభ్యర్థి గోపిమూర్తి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - కాకినాడ

ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎంఎల్సి అభ్యర్థి బొర్రా గోపిమూర్తి మంగళవారం నగరంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. పలు ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలను సందర్శించి ఉపాధ్యాయులను కలుసుకున్నారు. మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేసి గెలిపించాలని అధ్యాపకులు, ఉపాధ్యాయులను కోరారు. విద్యా రంగ సమస్యలు పట్ల శాసన మండలిలో ప్రస్తావిస్తానని తెలిపారు. ఉపాధ్యాయ ఉద్యమాలకు అండగా నిలుస్తానని, ప్రభుత్వ రంగాలు కాపాడడానికి నిజాయితీగా పోరాడతానని ఓటర్లకు హామీ ఇస్తూ ప్రచారంలో పాల్గొన్నారు. 16 హైస్కూల్స్, ఒక జూనియర్ కళాశాల, పీజీ సెంటర్ను సందర్శించి అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గోపిమూర్తి వెంట యుటిఎఫ్, జానవిజ్ఞాన వేదిక నాయకులు, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు, కాంటాక్ట్ అధ్యాపక సంఘ నాయకులు తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు.

గోపిమూర్తికి జనవిజ్ఞన వేదిక మద్దతు

పిడిఎఫ్ బలపర్చిన ఉపాధ్యాయ నియోజకవర్గ ఎంఎల్సి అభ్యర్థి బొర్రా గోపిమూర్తికి జనవిజ్ఞాన వేదిక మద్దతు తెలిపింది. మంగళవారం స్థానిక యుటిఎఫ్ హోంలో మాజీ ఎంఎల్సి విఠపు బాలసుబ్రహ్మణ్యం చేతుల మీదుగా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా రంగ శ్రేయస్సు, ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ కోసం నికరంగా నిలబడుతూ, ఉపాధ్యాయ, అధ్యాపకుల వాణి శాసన మండలిలో వినిపించేందుకు పిడిఎఫ్ ఎంఎల్సిలు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఎంఎల్సి అభ్యర్థి గోపిమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయ, అధ్యాపకులంతా తనను బలపరిచి గెలిపిస్తే షేక్ సాబ్జీ స్ఫూర్తితో శాసన మండలిలో నడుచుకుంటానని అన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కెఎంఎంఆర్.ప్రసాద్ మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక నాయకులు, కార్యకర్తలు గోపిమూర్తి విజయానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బివివి.సత్యనారాయణ, యుఎస్ఎన్.రెడ్డి, రామలక్ష్మి, ఈశ్వరరావు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎంఎల్సి విఠపు బాలసుబ్రహ్మణ్యం, ఇతర నాయకులు

దోబీఘాట్ల నిర్మాణం చేపట్టాలి

ప్రజాశక్తి - కాకినాడ



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం నాయకుడు కోనేటి రాజు

రజక వృత్తిదారులకు ఉపయోగపడే దోబీఘాట్లను నిర్మాణం చేయాలని ఎపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు కోనేటి రాజు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్లో సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన రాజు మాట్లాడుతూ రజకవృత్తిదారుల సమస్య లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దోబీ ఘాట్ల నిర్మాణం చేపట్టాలని, ప్రతి రజక కుటుం బానికి 250 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ను సరఫరా చేయాలని, 50 సంవత్సరాలు నిండిన వృత్తిదారులకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు కె.మాణిక్యం, కొజ్జవరపు నాగేశ్వరరావు, పాకలపాటి.సోమరాజు, శ్రీనివాస్, కొండబాబు, మణి, గంగాధర్ రావు, కనకరాజు, అప్పారావు పాల్గొన్నారు.

డెంగీ పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - తాళ్లరేవు



బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న రవికుమార్

డెంగీ, మలేరియా వంటి వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి పి.రవికుమార్ అన్నారు. స్థానిక గాంధీనగర్లో ఒక గర్భిణీకి డెంగీ సోకింది. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఆయన సంబంధిత బాధితురాలిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అక్టోబర్ నాటికి జిల్లావ్యాప్తంగా డెంగీ కేసులు తగ్గాయని, తిరిగి మళ్లీ నమోదు అవుతున్నాయని అన్నారు. డెంగీ నివారణకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా, గృహాల్లోని పాత్రలు, ఫ్రిజ్ వంటి గృహోపకరణాల్లో ఉన్న నీటిలో ఉండే లార్వా వల్ల డెంగూ దోమలు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. నిల్వ ఉన్న నీటిలో తోక పురుగులుగా ఉన్న దోమలు వైరస్ ఉన్న వ్యక్తులను కుట్టడం ద్వారా ఈ డెంగూ వ్యాధి మరొకరికి సోకుతుందని ఆయన వివరించారు. అనంతరం తాళ్లరేవు కేశవపురంలోని సబ్ సెంటర్ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గాడిమొగ పిహెచ్సి సిబ్బంది కె.ఆంజనేయులు, బొడ్డు కుమార్, జ్యోతి, కెఎన్.ప్రసాద్ పాల్గొన్నారు.

రాజ్యాంగం స్ఫూర్తిని కొనసాగిద్దాం

రాజ్యాంగ దినోత్సవాన్ని జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రతీ ఒక్కరూ రాజ్యాంగాన్ని అవగాహన చేసుకోవాలని పలువురు సూచించారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని అందిస్తూ రాజ్యాంగం రూపొందించ బడిందన్నారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ కలెక్టరేట్లో జరిగిన రాజ్యాంగ దినోత్సవ వేడుకలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి కలెక్టర్ షాన్మోహన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పి సిఇఒ వివివిఎస్.లక్ష్మణరావు, గృహ నిర్మాణ శాఖ పీడీ ఎన్వివి.సత్యనారాయణ, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, సిపిఒ పి.త్రినాథ్ పాల్గొని ప్రతిజ్ఞ చేశారు. అలాగే ఎంఎస్ఎన్ చారిటిస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుక ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో చారిటీస్ ఛైర్మన్ మల్లాడి కార్తీక్ నాయకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎన్ చారిటీస్ సహాయక కమిషనర్, కార్యనిర్వహణాధికారిణి కె.విజయలక్ష్మి, సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయులు సిహెచ్.శ్రీహరిరావునాయుడు, హెచ్ఎం ఎంఎస్.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సామాజిక న్యాయ సాధన సమితి, యునైటెడ్ ఎస్సి, ఎస్టి ఫోరం ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని స్థానిక ఇంద్రపాలెం అంబేద్కర్ కాంస్య విగ్రహం వద్ద ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్టిఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె బాబ్జి, సామాజిక న్యాయ సాధన సమితి అధ్యక్షురాలు డాక్టర్ భానుమతి, దళిత సంఘ నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, ఎస్సి, ఎస్టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ మోకా పవన్కుమార్ సంఘ నాయకులు తుమ్మల నూకరాజు, కె.శ్రీనివాస్, భయ్యా కుమార్, టి.పృథ్వీ రాజ్, మెర్త రాజశేఖర్, కృష్ణమూర్తి, పిట్టా వరప్రసాద్, బచ్చుల కామేశ్వరరావు, పలివెల వీరబాబు, ఏనుగుపల్లి కృష్ణ పాల్గొన్నారు. అలాగే ఐడిఎల్ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినికుమారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.సత్యనారాయణ, పి.వీరబాబు, డాక్టర్ జి.స్టీవెన్ రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల కామర్స్ డిపార్ట్మెంట్ హెడ్ వి.నాగేశ్వరరావు, గోపాలకృష్ణ యాదవ్, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శిరీష్, అకౌంటెంట్ సత్యనారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు. **కరప** మండలంలోని వాకాడ ఎంపిపి స్కూల్లో హెచ్ఎం వి.శ్రీరామరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఇఒ పి.సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ దివ్యభాను, వైస్ ఛైర్మన్ దుర్గ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **పిఠాపురం** స్థానిక ఆర్ఆర్బిహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ ఇ.కేశవరావు ఆధ్వర్యంలోనూ, వైసిపి కార్యాలయంలో మాజీ ఎంపీ వంగా గీత ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జరిగాయి. మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి మాల మహానాడు అధ్యక్షులు గుబ్బల రాజు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామకృష్ణ, దళిత బహుజన పార్టీ జిల్లా ఇన్ఛార్జ్ ఆర్.నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. **రౌతుల పూడి** స్థానిక రెవెన్యూ కార్యాలయం ఆవరణలో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి యుటిఎఫ్ మండల అధ్యక్షులు కొరుప్రోలు హరిబాబు, వార్డెన్ వర్మ, ఉపాధ్యాయులు సింహాచలం, గంటి మల్ల సత్తిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. **కాజులూరు** స్థానిక జడ్పి ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకను హెచ్ఎం పంపన కృష్ణ మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించా రు.విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. **గొల్లప్రోలు** స్థానిక బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం చింతకాయల సూర్యప్రకాశరెడ్డి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.యామిని, కె.సబిత పాల్గొన్నారు. **సామర్లకోట** మండల పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి ఎంపిపి బొబ్బరాయుడు సత్తిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే చంద్రంపాలెం గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి తహశీల్దార్ కె.చంద్రశేఖర్ రెడ్డి, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ ఎడ్ల శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక జడ్పి బాలిక ఉన్నత పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి హెచ్ఎం యు.మీనామాధురి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ ఎఒ, సీనియర్ అసిస్టెంట్, విఆర్ఒలు ఖాదర్ వల్లి, పద్మనాభం పాల్గొన్నారు. **కోటనందూరు** తుని పట్టణంలోని స్వెసెస్ డిగ్రీ కళాశాలలో శ్రీ ప్రకాష్ విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో న్యాయవాది జిపి.మధురాగ్రేస్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎ.రామకృష్ణారెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక జవహర్లాల్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివైఇఒ ఇ.ప్రభాకరశర్మ, హెచ్ఎం కె.శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **ప్రత్తిపాడు** మండలంలోని ధర్మవరంలో జరిగిన కార్యక్రమంలో వైసిపి నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పాల్గొని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** స్థానిక అంబేద్కర్ భవన్ వద్ద మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు జక్కల ప్రసాద్ బాబు, కాశి లక్ష్మణస్వామి, ఎలిపే నాగేశ్వరరావు, విఎఎల సంఘం అధ్యక్షులు ఈశ్వరి బాయి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, దడాల జగదీశ్వరరావు, గోడి భాస్కరరావు దడాల బుజ్జిబాబు, దాసరి వేణుగోపాల్, ఎంపిటిసి సభ్యులు గుత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ షాన్మోహన్



మాట్లాడుతున్న ఎంఎస్ఎన్ చారిటీస్ ఛైర్మన్ కార్తీక్



సామర్లకోటలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపిపి సత్తిబాబు



పెద్దాపురంలో బహుమతిని అందిస్తున్న డివైఇఒ శర్మ

కార్టూ'నిజం'



ఐపిఎల్ లో... కోట్లకు అమ్ముడుపోయిన ప్లేయర్లు ....!

ఫ్యాక్టరీ తెరిపించాలని మోకాళ్లపై ధర్నా

ప్రజాశక్తి - ఏలేశ్వరం, జగ్గంపేట



మోకాళ్లపై నిల్చుని నినదిస్తున్న కార్మికులు

ఈ నెల 16 న అర్ధాంతరంగా నిలిపివేసిన చిన్నంపేట జీడిపిక్కలు ఫ్యాక్టరీ తెరిపించాలని సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు మోకాళ్లపై కూర్చుని ధర్నా చేపట్టారు. మంగళవారం జరిగిన ఈ ధర్నాలో సిఐటియు ప్రత్తిపాడు మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ ఫ్యాక్టరీ మూసివేయడంతో 409 మంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. ఫ్యాక్టరీని తెరిపించాలని గత పది రోజులుగా అనేక రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తూ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లిన ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు కంట చక్రధర్, కర్రీ రాజా, కాకర ప్రసాద్, వనము దుర్గాప్రసాద్, ఎ.రామదుర్గ, సిహెచ్.గోవింద్, వై.రమేష్, జి.వీరబాబు, ఎస్.జయలక్ష్మి, వై.శివ వరలక్ష్మి, కె.కృష్ణవేణి పాల్గొన్నారు.

ఎంఎల్ఎను కలిసిన కార్మికులు

చిన్నంపేట జీడిపిక్కల పరిశ్రమ కార్మికులు ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూను కలిశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకుడు రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ అర్ధాంతరంగా పరిశ్రమను నిలిపివేయడంతో సుమారు 409 మంది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయని అన్నారు. ప్రభుత్వమే పరిశ్రమను తీసుకుని నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆయనను కోరారు. దీనిపై ఎంఎల్ఎ మాట్లాడుతూ డిసిఎల్తో మాట్లాడి కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మికులు వీరబాబు, కంట చక్రధర్, కాకరప్రసాద్, ఎ.రామదుర్గ, సిహెచ్.గోవిందు, జి.వీరబాబు, జయలక్ష్మి, దుర్గ, అన్నపూర్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - సామర్లకోట

గత ప్రభుత్వంలో చేపట్టిన భూముల రీ సర్వేలో జరిగిన లోపాలను సరిదిద్దేందుకు నిర్వహిస్తున్న రీ సర్వే గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కె.చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని చంద్రంపాలెంలో రీ సర్వే గ్రామసభ తహశీల్దార్ అధ్యక్షతన జరిగింది. భూ యజమానులు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు గ్రామ సభలో పాల్గొని పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ గ్రామ సభల్లో మొత్తము 33 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు. ఈ కార్య క్రమంలో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ వై.శ్రీనివాస్, మండల సర్వేయర్ పి.సీతారామాచార్యులు, విఆర్ఒలు ఖాదర్ వల్లి, పద్మనాభం, రైతులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు పెడితే ఊరుకోబోము...

ప్రజాశక్తి - కోటనందూరు

అక్రమ కేసులు పెడితే చూస్తూ ఊరుకోమని మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసిపి సోషల్ మీడియా ప్రతినిధుల పై అక్రమ కేసులు నమోదు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టిన ఎదుర్కొంటామని అన్నారు. కార్యకర్తలు, నాయకులకు అండగా వైసిపి ఉంటుందన్నారు. ప్రభుత్వం రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తుందని అన్నారు. చంద్రబాబు ఆరు నెలలు పరిపాలనను ప్రజలు అసహ్యించుకుంటున్నారని, రాష్ట్రం అంతా పాలన ఒకలాగా ఉంటే తుని నియోజకవర్గంలో మరోలా ఉందన్నారు. పోలీసులు కాకి డ్రెస్ తీసేసి పశువు రంగు బట్టలు ధరించి విధులు నిర్వహిస్తున్నారని, వైసిపి ఎల్లప్పుడూ ప్రతిపక్షంలోనే ఉండదని గ్రహించుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బొంగు ఉమారావు, బోడపాటి సతీష్, రాయి మేరీ, అవినాష్, పోతల రమణ, పోతల లక్ష్మణ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లకు చేపట్టే మరమ్మతు పనుల కోసం బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎవిఎన్డిఎస్.ప్రభాకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బలుసులపేట, సంత మార్కెట్, ఇందిరా కాలనీ, నీలమ్మ చెరువు, మెహర్ కాంప్లెక్స్, సంగీతరావు పేట, పెద్ద పోస్ట్ ఆఫీస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని బైపాసు రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, ముగ్గురు గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని చిత్రాడ గ్రామానికి చెందిన పి.దుర్గాప్రసాద్ భార్య సమత, తల్లి సాయికుమారి, ఏడాది లోపు చిన్నారితో కలిసి మోటారు సైకిల్‌పై గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణదేవి ఆలయానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా పిఠాపురం జాతీయ రహదారి సీతయ్యగారితోట సమీపంలో ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీ కొట్టాడు. దీంతో కిందపడిపోయిన దుర్గాప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందగా, మిగిలిన ముగ్గురు గాయాలపాలయ్యారు. వీరిని పిఠాపురం ప్రభుత్వాసుపత్రి తరలించి ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

జగ్గంపేట మండలం కొత్తూరు రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన చింతల శ్రీను(45) గాయపడ్డాడు. క్షతగాత్రుడిని గండేపల్లి మండలం నీలాద్రి రావు పేట శివారున ఉన్న ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. నాటి నుంచి చికిత్స పొందుతున్న ఆ వ్యక్తికి మంగళవారం శస్త్ర చికిత్స చేసేందుకు ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లారు. లోనికి తీసుకెళ్లిన అర్థ గంటలోపే ఆ వ్యక్తి గుండెపోటుకు గురియై మృతి చెందినట్లు వైద్యులు కుటుంబ సభ్యులకు వెల్లడించారు. అయితే ఆస్పత్రి నిర్లక్ష్యం వల్లే తమ కుటుంబీకుడు మృతి చెందాడని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఇసుక లారీ స్వాధీనం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పోలీసులు స్వాధీన పరచుకుని కేసు నమోదు చేశారు. మండలంలోని తాడిపూడి గ్రామంలో మంగళవారం ఇసుకను తరలిస్తున్న లారీని ఎస్ఐ ఎస్.రాము తనిఖీలు చేశారు. ఇసుక తరలింపునకు ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో లారీని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పాత సూరంపాలెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు. అలాగే పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి గ్రామంలో లీటరు సారా స్వాధీనం చేసుకుని ఒక మహిళను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు పి.చిట్టిబాబు, ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

స్నానానికి దిగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కోరుకొండ

చెరువులో స్నానానికి దిగి వ్యక్తి మృతి చెందిన ఘటన కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు శ్రీరంగపట్నం గ్రామంలోని చెరువులో రాపేటి శ్రీనివాసరావు(40) స్నానానికి దిగాడు. ప్రమాదవశాత్తు మతి చెందాడని పోలీసులు తెలిపారు. మతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నడకుదురు గొడౌన్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - కరప

నడకుదురులో ఒక గొడౌన్‌లో మండల సివిల్ సప్లయిస్ అధికారులు తనిఖీ లు చేపట్టారు. రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్‌కు వచ్చిన సమాచారంతో ఈ తనిఖీలు చేపట్టారు. గొడౌన్లలో పిడిఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తిం చినట్లు తోట సుధీర్ తెలిపారు. పూర్తి స్థాయి తనిఖీల అనంతరం వివరాలను వెల్లడిస్తామని తెలిపారు.

పాత్రికేయులకు అండగా ఎపిడబ్ల్యుజెఎఫ్

ప్రజాశక్తి - జగ్గంపేట

పాత్రికేయులకు అండగా ఎపిడబ్ల్యుజెఎఫ్ నిలుస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్కె.మున్ని, జిల్లా అధ్యక్షులు వి.నవీన్ అన్నారు. మంగళవారం స్థానిక మాణిక్యం కాంప్లెక్స్ వద్ద నియోజకవర్గ సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో పాత్రికేయులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత 17 ఏళ్లుగా సంఘం అండగా నిలుస్తుందన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షులు అడబాల వీరభద్రరావు, కార్యదర్శి తణుకు రామచంద్రరావు, గౌరవ అధ్యక్షులు నాయుడు, సతీష్, వట్టూరి వీరబాబు, కృష్ణ, అడబాల సుబ్బన్న, సూరిబాబు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక ఆంధ్ర బాప్టిస్ట్ జూబిలీ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. దీనితో నెలరోజులు ముందుగానే క్రిస్మస్ వేడుకలను క్రైస్తవ ప్రజలు ప్రారంభించారు. సంఘ ఉప కార్యదర్శి పిట్టా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో అబ్రాహాం బైబిల్ గ్రంథం లోని ఏడు నాక్షత్రాల గురించి వివరించారు. ఈ వేడుకల్లో సంఘకాపరి రెవ. బి.కిరణ్‌కుమార్, సంఘ కార్యదర్శి టి.సూర్యారావు, నాయకులు జి.అన్నపూర్ణ, ఐఇ.జీవన్‌కుమార్, పున్నమి చంద్రుడు, బి.జాన్ బాబు, బొడ్డు రామారావు, టి.అమర్‌కళ్యాణ్ పాల్గొన్నారు.

ఘనంగా వన సమారాధన

ప్రజాశక్తి - కాజులూరు

బంధుమిత్రుల మధ్య ఐక్యతకు వన సమారాధన ద్రోహం చేస్తాయని మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు వరద శేషారావు అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పునిల్లి శివారులో కోలంక వరదా వారి కుటుంబ సభ్యులు వన సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వరద వెంకట నాగేశ్వరరావు, వరద వెంకట రామమూర్తి, మండల వ్యవసాయ అధికారి అశోక్, ఆర్ఐ వేగేశ్వరరావు పాల్గొన్నారు.

మెప్మా బజార్లు ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం, పిఠాపురం

స్థానిక మున్సిపల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మెప్మా సిఎంఎం భ్రమరాంబ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసిన వివిధ రకాల వస్తువులు, పచ్చళ్ళు, వస్త్రాలు, అల్లిక వస్తువులు, తినుబండారాలు తదితర 18 రకాల వస్తువులతో ఈ బజారు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి మహిళ తన కాళ్లపై తాను నిలబడే విధంగా ఆర్థికాభివృద్ధి సాధించే లక్ష్యంతో బజార్ ద్వారా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిఒలు, ఆర్‌ఐపలు పాల్గొన్నారు. అలాగే పిఠాపురం పురపాలక సంఘం, మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్‌ను ప్రారంభించారు. మెప్మా సిఎంఎం కె.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ప్రారంభమైన బజార్‌లో మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన ఆహార ఉత్పత్తులతో స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా ప్రతినిధులు ఎండి సల్మా, శైలజ, సిహెచ్.శ్రీవల్లి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



విక్రయాల చేస్తున్న డ్వాక్రా మహిళలు

న్యాయం చేయాలని మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి - పెద్దాపురం

తొండంగి తీర ప్రాంతంలో దివిస్ కంపెనీ పైపులైను వల్ల జీవనోపాధిని కోల్పోతున్నామని తమకు న్యాయం చేయాలని మత్స్యకారులు స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ శ్రీరమణికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ దివిస్ కంపెనీ సముద్రంలో వేసే పైపులైన్ వల్ల, కెమికల్ వ్యర్థాల వల్ల మత్స్య సంపద పూర్తిగా నాశనం అయ్యే పరిస్థితి ఉందని, మత్స్య సంపదపై ఆధారపడ్డ తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మత్స్యకార కుటుంబాలను ఆదుకునేందుకు రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి నెలకు రూ.15 వేలు భృతి శాశ్వతంగా ఇవ్వాలని, చదువుకున్న ప్రతి ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని, ప్రతి రేషన్ కార్డుదారులకు రూ.10 లక్షలు విలువ చేసే హెల్త్ కార్డు ఇవ్వాలని, విద్య, వైద్యం, తాగునీరు, వీధిలైట్లు, కాలువలు, విద్యుత్తు, వంటి సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చొక్కా అప్పారావు, కాశీ ఈశ్వరరావు, చొక్కా జగన్నాథం, మట్టి రమణ, రాంబాబు, మంగ, కోడ రమణ పాల్గొన్నారు.



ఆర్‌డిఒకు సమస్యను వివరిస్తున్న మత్స్యకారులు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీరమణి

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని ఆర్‌డిఒ శ్రీరమణి అన్నారు. మంగళవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. రెవెన్యూ కార్యాలయానికి వచ్చే ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. పిజిఆర్‌ఎస్‌లో వచ్చే ప్రతీ అర్జీని పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రీ సర్వే గ్రామ సభలో వచ్చే అర్జీలపై సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎఒ మాధవరావు, డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు సిహెచ్.వెంకటలక్ష్మి, సుభాష్, రమేష్, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, సూర్యప్రభ, మురారి, ప్రసాద్, పోతురాజు, చిరంజీవి పాల్గొన్నారు.

ఆయుష్ యాప్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ

దేశ్ కా ప్రకృతి పరీక్షణ్ అనే ఆయుష్ మొబైల్ యాప్‌ను ఆర్‌డిఒ ఎన్.మల్లి బాబు ఆవిష్క రించారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా ప్రతి పౌరుని యొక్క శారీరక మానసిక, ఆరోగ్యం యొక్క సమాచారం పొందుపరచి ఉంటుందన్నారు. ప్రతి పౌరుడు ఆయుష్ డిపార్టమెంట్ ఆయుర్వేద వైద్యుల వద్ద నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియ ఒక వ్యక్తికి కనీసం 36 నిముషాలు సమయం పడుతుందన్నారు. ప్రతిఒక్కరూ ఈ సదుపాయం వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు డాక్టర్ నీరజ, డాక్టర్ రేణుక, డాక్టర్ సయ్యద్ అలీ, డాక్టర్ విజయలక్ష్మి, శ్రీనివాస్, ఆయుర్వేద శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



యాప్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌డిఒ మల్లిబాబు

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహాత్మా గాంధీ పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీని శారీరక వైకల్యం కలిగిన బాలల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ చౌదరి అన్నారు. మంగళవారం ఆయన భవిత కేంద్రంలో నిర్వహించిన ఫిజియోథెరపీని పరిశీలించారు. అనంతరం ఆయన బహుధ్యా కేంద్రం నిర్వహణ, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని శారీరక వైకల్యం ఉన్న బాలలను గుర్తించి వారి తల్లిదండ్రులకు ఈ ఫిజియోథెరపీ కేంద్రంపై అవగాహన పెంచాలన్నారు. ఈ ఫిజియోథెరపీ ద్వారా బాలలకు సత్ఫలితాలిస్తున్నందున తల్లిదండ్రులు ఈ ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు డాక్టర్ అపర్ణ, ఉపాధ్యాయులు బి.దుర్గాప్రసాద్‌రెడ్డి, బి.ఆనందరావు పాల్గొన్నారు



ఫిజియోథెరిఫీని పరిశీలిస్తునన ఎంఇఒ

యానాం వార్తలు



మోడీ విధానాలకు వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - యానాం

మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ,రైతు, ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్, రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ కెవివి.సత్యనారాయణలు మాట్లాడారు. మోడీ పాలనలో రైతుల ఆత్మహత్యలు రెట్టింపు అయ్యాయని, నిరుద్యోగం పెద్దఎత్తున పెరిగిపోయిందన్నారు. పరిశ్రమల్లో కార్మికులు బానిసలకంటే దారుణమైన రీతిలో పని భారంతో పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పరిస్థితులు దీనికి భిన్నంగా లేవని, ఎన్నికల ముందు ప్రజా సమస్యలపై ఉపన్యాసాలు దంచిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇళ్ల వాసు, టి.శ్రీనివాసరావు, సబ్బతి రాంబాబు, తిరికోటి శ్రీనివాసరావు, దాసరి రాజు, తాడిపల్లి మధుబాబు, పి.మణికంఠ, ఆర్.సురేష్, పి.శివకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - యానాం

భారత రాజ్యాంగ దినోత్సవంగా సందర్భంగా యానాంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆర్ఎఒ మునిస్వామి ప్రారంభించారు. స్థానిక పాత బస్టాండ్, అంబేద్కర్ సర్కిల్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి తిర్రి గోపి, ఎన్ఎస్ఎస్ రీజినల్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణసుధాకర్, ప్రోగ్రాం ఆఫీసర్లు చల్ల నరేష్, కృష్ణంరాజు, శశికాంత్ వర్మ, వాసంశెట్టి ఆనంద్, మన్నే కిరణ్ పాల్గొన్నారు. అలాగే ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పోనుగుమట్ల విష్ణుమూర్తి, గిడ్డి బలరాం, పండు సిద్ధార్థకుమార్ పాల్గొన్నారు. అలాగే కమలా నెహ్రూ ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కెఎన్.లక్ష్మి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.

'మనం -మన రాజ్యాంగం' పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి - యానాం

యానాం జనమిత్ర సంపాదకులు, రచయిత పొనుగుమట్ల విష్ణుమూర్తి రాసిన 'మనం -మన రాజ్యాంగం' పుస్తకాన్ని ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి మంగళవారం తన చాంబర్లో ఆవిష్కరించారు. విద్యార్థుల అవగాహన కోసం ఈ పుస్తకం వెలువరించానని రాజ్యాంగం గురించి అనేక విషయాలు పొందూపరిచిందని విష్ణుమూర్తి తెలిపారు. పుస్తకానికి ముందుమాట రాసిన కవి, కథకుడు దాట్ల దేవదానంరాజు మాట్లాడుతూ విషయ సేకరణ చేసి శ్రమపడి ఎంతో సరళంగా ఈ పుస్తకాన్ని తీసుకొచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞానవేదిక నాయకులు కెవివి.సత్యనారాయణ, ముర్రే మీరాసాహెబ్, వీరాస్వామి, ఫణి పాల్గొన్నారు.

సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి - సామర్లకోట

సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, చట్టాలపై స్థానిక సిబిఎం సెంటర్‌లో మంగళ వారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డిఎస్‌పి డి.శ్రీహరి రాజు, సిఐ కృష్ణభగవాన్ పాల్గొని మాట్లాడారు. స్వీయ రక్షణ, బాల్య వివాహాలు, తెలియని వయ సులో ప్రేమ, ఆకర్షణ, సోషల్ మీడియాలో పరిచయాలు, ఆన్‌లైన్ వేధింపులు, ప్రేమ పేరుతో వలవేసి చేసే ఆర్థిక, శారీరక, మానసికంగా ఇబ్బందులు, మహిళలపై జరుగుతున్న నేరా లు, ఈవ్ టీజింగ్‌పై అవగాహన కల్పించారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే 112 నంబ ర్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థునులకు అవగాహన కల్పిస్తున్న డిఎస్‌పి శ్రీహరిరాజు



పిఠాపురంలో జరిగిన అవగాహన సదస్సులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

బాల్య వివాహాలపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి, పిఠాపురం

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మండలంలోని తాళ్లూరు జడ్‌పి ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి పాల్గొని బాలల హక్కులు, లైంగిక వేధింపులు, బాలల చట్టాలు, మంచి స్పర్శ, చెడు స్పర్శ, బాలల హెల్ప్ లైన్ 1098 గురించి వివరించారు. అనంతరం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కెవివి.సత్యనారాయణ, జిఎంఎస్ కె.మౌనిక, పోలీస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పిఠాపురం పట్టణంలోని కమ్యూనిటీ హాల్లో మంగళవారం బాల్యవివాహ చట్టం, కిశోర వికాసంపై అవగాహన కార్యక్రమం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గోపాలకృష్ణ, ఐసిడిఎస్ జిల్లా బాల రక్షణ అధికారి వెంకట్ మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక కమిటీలు సమర్థవంతంగా పనిచేసినట్లైతే క్షేత్రస్థాయిలో బాల్య వివాహాలను నిరోధించవచ్చన్నారు. కమిటీలు గ్రామస్థాయిలో ఏవిధంగా పనిచేయాలన్న అంశంపై పలు సూచనలు చేశారు. జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ బాలలపై లైంగిక దాడులు, ఫోక్సో, బాలల వ్యక్తిగత భద్రత తదితర అంశాలను వివరించారు. పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ సుజాత కిషోర్ బాలికల్లో ఆరోగ్య సమస్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ఐసిడిఎస్ సిడిపిఒ దుర్గాదేవి ప్రమాణ నినాదాలు చేయించారు.



గండేపల్లిలో జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న దుర్గారాణి

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



సదస్సులో మాట్లాడుతున్న ఎఎస్ ప్రకాష్

ప్రజాశక్తి - గండేపల్లి

ఆయిల్ ఫామ్ సాగు విస్తీర్ణంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని కె.గోపాలపురంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ డిజిఎం ఎఎస్.ప్రకాష్ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ తోటల ద్వారా అధిక లాభాలను పొందవచ్చన్నారు. ఆయిల్ ఫామ్ పంట ప్రాముఖ్యత, ప్రత్యేకతలు, ఉద్యానశాఖ రాయితీలు, కంపెనీ రైతులకు కల్పించే సదుపాయాలను వివరించారు. పంటను ఆశించే చీడ పీడలు, వాటి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ సిబ్బంది జివివిఎస్.దుర్గాప్రసాద్, వి.నరేష్, వి.బాలాజీ, కెవివి.ప్రసన్న, బి.దుర్గా ప్రసాద్, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

జెడ్.రాగంపేటలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని తాళ్లూరు, జెడ్.రాగంపేట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి మాట్లాడుతూ రబీ-2024-25లో వరి నారు మడి, యాజమాన్యం, శనగ విత్తే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల పై అవగాహన కల్పించారు. ఉద్యాన అధికారి లావణ్య మాట్లాడుతూ పామాయిల్ అధిక దిగుబడులు పొందడానికి చేపట్టవలసిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ చంద్రమౌళి, విఎఎ సురేఖ, పృథ్వీరాజు, రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రమాదకరంగా కల్వర్టు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావుపేటలోని కల్వర్టుపై కప్పు రాయి కూలిపోయింది. ఈ రహదారి మీదుగా శ్రీ ప్రకాష్ స్కూల్‌తోపాటు, పలు ప్రభుత్వ కార్యాలయాలకు విద్యార్థులు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలోనే రహదారిలోనే కల్వర్టుపై కప్పురాయి కూలిపోయింది. ఏదైనా ప్రమాదం జరుగుతుందనే ఆందోళనతో స్థానికు ఆ ప్రాంతంలో కర్రలు అడ్డుగా వేశారు. రాత్రి సమయాల్లో వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి కల్వర్టుపై కప్పురాయిని వేయాలని స్థానికులు కోరుతున్నారు.



కల్వర్టుకు మధ్యలో పెద్ద గుంత

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి - కరప

మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలు, అంబేద్కర్ విగ్రహాల వద్ద రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక పిహెచ్‌సి ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రముఖ వైద్యులు డాక్టర్ బోండా సూర్యారావు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, ఎస్‌సి నాయకులు పిల్లి శివకుమార్, బచ్చుల కామేశ్వరరావు, పండుల అశోక్ కుమార్, పిఆర్ కాలేజ్ ప్రిన్సిపల్ పాల్గొని. మండల అంబేద్కర్ యువజన సేవా సంఘం అధ్యక్షులు మెండు గోవింద్ అధ్యక్షతన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక తాహశీల్దార్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి తహశీల్దార్ సత్యనారాయణ పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మోహన అశోక్, శివకుమార్, పోలినాటి శ్రీనివాస్, సాదే వీరరాఘవులు పాల్గొన్నారు.

వరి రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - అమలాపురం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మూలంగా ఈ నెల 29,30, డిసెంబరు 1, 2 తేదీల్లో వర్షాలు వచ్చే అవకాశం ఉందని జెసి టి.నిషాంతి అన్నారు. ఈ కారణంగా జిల్లాలో వరి రైతులు తమ పంటల ను కాపాడుకునేలా అప్రమత్తం కావాలని మంగ ళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.. ప్రస్తుతం నిలబడి ఉన్న వరి పంట కోతలు కోయరాదని సూచించారు. సాధారణంగా కోతలు కోసి పనులు మీద ఉన్న ధాన్యాన్ని ఉప్పు ద్రావణంతో పిచికారీ చేస్తూ మొలకలు రాకుండా, రంగు మారకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ఇప్పటికే నూర్చిన ధాన్యాన్ని వెంటనే తమకు నచ్చిన మిల్లులకు తరలించి విక్రయించుకునేలా పౌర సరఫరాల శాఖ పూర్తి సహకారాలు అందిస్తుం దన్నారు. రోడ్ల పై ఆరబెట్టిన ధాన్యాన్ని కూడా మిల్లులకు ట్యాగింగ్ చేస్తారన్నారు. ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని ఆమె సూ చించారు. రైస్ మిల్లుల వద్ద నియమించిన కస్టోడియన్ అధికారులు అందుబాటులో ఉండి గోనె సంచు లు హమాలీలు రవాణా వసతు లను రైతులకు ఎటు వంటి అసౌకర్యం కలగకుండా కల్పిస్తారన్నారు. జిల్లాస్థాయి కమాండ్ కంట్రోల్ రూమ్ లో జిల్లా పౌరసరఫరాల మేనేజర్ జిల్లా పౌరసరఫరాల అధికారి అందుబాటులో ఉండి రైతులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తారని, రైతులు తమకు ఇబ్బంది వచ్చినా వెంటనే మండల జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేయాలన్నారు.